క్లుప్తంగా

మేధోసంపత్తికి పూజలు



మేధో దక్షిణామూర్తి పూజలు చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మండలంలోని యర్రంపేట ఉమా సమేత రామలింగేశ్వర ఆలయంలో శనివారం మేధో దక్షిణామూర్తి పూజలు చేశారు. అర్చకుల కుమారస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులకు సామూహిక పూజలు చేపట్టి చిన్నారుల చేత అక్షరాభ్యాసం, మేధోసంపత్తికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలల్లో విద్యాసంవత్సరం ప్రారంభించే విద్యార్థులకు మేధో దక్షిణామూర్తి పూజల వల్ల ప్రజ్ఞావంతులుగా తయారవుతారని అర్చకులు పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ సందర్భంగా అధిక సంఖ్యలో తన చిన్నారులతో ఈ పూజలు చేయించారు.

పారిజాతగిరిలో విశేష పూజలు



జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం సందర్భంగా సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలను ప్రారంభించి అనంతరం నిత్య నివేదన, మంగళా శాసనం, భక్తులకు సర్వదర్శనం, హారతి, అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఉండ్రాజవరం చెందిన గన్నామని శ్రీరామారావు దంపతులు పొంగుటూరుకు చెందిన తోట మునేశ్వరరావు దంపతులు ఉభయదారులుగా అన్న ప్రసాద వితరణ చేశారు. భక్తులు విశేష సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారని కార్యనిర్వహణ అధికారి మానికల రాంబాబు తెలిపారు.

శ్రీవారి సేవలో ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



విక్టర్ ప్రసాద్‌కు శ్రీవారి మెమెంటో ఇస్తున్న ఈఓ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మరుమూడి విక్టర్ ప్రసాద్ శనివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు చినవెంకన్న మెమెంటో, ప్రసాదాలను అందజేశారు.

12 నుంచి జీపు యాత్ర

కొయ్యలగూడెం: సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 12 నుంచి నిర్వహించే జీపు యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. సీపీఐ స్థానిక కార్యాలయం వద్ద కొయ్యలగూడెం మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కృష్ణ చైతన్య మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాలను యూనిట్గా తీసుకొని పునరవాస కాలనీలకు తరలించాలని, ఆర్ ఆర్ ప్యాకేజీ రూ.10 లక్షలు ఇవ్వాలని, 2022లో వరద బాధితులకు రూ.10 వేలు ఇవ్వాలని, గిరిజనులు సాగు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి ఎస్కే బాజీ, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఫలితాలు విడుదల

చింతలపూడి: గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8 తరగతులు, జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం, డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం ప్రవేశ పరీక్ష ఫలితాలు ఈనెల 8వ తేదీన విడుదల చేసినట్టు నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి మే 20న ప్రవేశ పరీక్ష నిర్వహించామని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 9959666156లో సంప్రదించవచ్చని తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

పెదపాడు: మండలంలోని అప్పనవీడు శివారు తాళ్లమూడి వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 9న బుట్టాయిగూడెం మండలం నిమ్మలవారి గూడెంకు చెందిన మొందూరు అనిల్‌కుమార్ (27) వరుసకు సోదరి అయిన జయరమ్యను వట్లూరు సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాల నుంచి మోటారు సైకిల్‌పై తీసుకు వెళ్తుండగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇరువురికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా శనివారం అనిల్‌కుమార్ మృతి చెందాడు. మృతుడి తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై కృష్ణా చల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవనోపాధి కల్పించే కార్యక్రమం ఫిష్ ఆంధ్రా

ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం: మత్స్యకారులకు జీవనోపాధి కల్పించే కార్యక్రమం ఫిష్ ఆంధ్రా అని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఫిష్ ఆంధ్రా వెహికల్‌ను జంగారెడ్డిగూడెంలో ఆయన ప్రారంభించి లబ్ధిదారునికి తాళాలు అందజేశారు. ఫిష్ ఆంధ్రా కార్యక్రమంలో నియోజకవర్గంలోని మత్స్యకారులకు వాహనాలు మంజూరయ్యాయని, వీటిని అర్హులకు అందజేస్తామని చెప్పారు. జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి గ్రామానికి చెందిన చాబత్తుల ఆనంద్ అనే మత్స్యకార లబ్ధిదారునికి తొలి వాహనాన్ని అందజేశామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారులకు మత్స్యసంపదను మార్కెటింగ్ చేసుకునేందుకు వీలుగా ఈ వాహనాలను అందిస్తున్నట్టు చెప్పారు. ఈ వాహనం ఖరీదు రూ. 4.50 లక్షలు కాగా, రాష్ట్ర ప్రభుత్వం 60 శాతం సబ్సిడీపై అందిస్తుందన్నారు. ప్రజల కోసం పనిచేస్తోన్న జగన్‌మోహన్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరుపున ధన్యవాదాలు తెలిపారు.



జంగారెడ్డిగూడెంలో లబ్ధిదారునికి వాహనాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

టీడీపీకి ఎందుకంత చులకన

ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే పథకాలను ప్రతిపక్ష పార్టీ టీడీపీ చులకనగా మాట్లాడుతున్నాయని జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి ఆరోపించారు. ప్రభుత్వం చేపలు, మాంసం దుకాణాలు ప్రకటించినప్పుడు అపహాస్యంగా టీడీపీ మాట్లాడిందని, చేపలు, మాంసం అమ్మునే వారంటే ఎందుకంత చులకనని ప్రశ్నించారు. అందరికీ సరైన ఉపాధి కల్పించే లక్ష్యంతో ఒక్కొక్క సామాజిక వర్గానికి ఒక్కొక్క విధంగా పథకాలను అందజేస్తూ రాష్ట్రంలో పేదరికం లేకుండా సీఎం కృషి చేస్తున్నారని చెప్పారు. ఫిష్ ఆంధ్రా కార్యక్రమం మత్స్యకారులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తిన చిన్న, కోఆప్షన్ సభ్యుడు వెంపా బిజక్, పసుపులేటి నాగార్జున, రంగ, ఇన్‌చార్జి ఎఫ్‌డీఓ కె.మంగారావు, మత్స్యశాఖ సిబ్బంది ప్రసాద్, జకీరా, ప్రేమ్‌కుమార్, రజని, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి ఇంటా ప్రగతి



కొత్తూరులో పథకాలు బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన నవరత్నాల సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ప్రతి ఇల్లూ ప్రగతి పథంలో నడుస్తోందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. శనివారం కామవరపుకోట పంచాయతీ కొత్తూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలీజా మాట్లాడుతూ టీడీపీ హయాంలో పేదల సంక్షేమాన్ని, అభివృద్ధిని గాలికొదిలేసిందని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలోని ప్రతి పేదవాడూ ఆర్థిక అభివృద్ధి పొందాలనే లక్ష్యంతో నవరత్నాలను తీసుకొచ్చారని, నాలుగేళ్లలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించారని, హామీలను నూరుశాతం నెరవేర్చారని చెప్పారు. ఈ నేపథ్యంలో మరలా రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభంజనమని ధీమా వ్యక్తం చేశారు. తొలుత ఎమ్మెల్యే ఎలీజాకు మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు మిడతా రమేష్ బాబు, నానాది సాగర్, కామవరపుకోట సర్పంచ్ కరిపోతూ అనూష, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, ఎంపీటీసీలు తమ్మిశెట్టి గిరిజ, బొల్లు వెంకట సత్యనారాయణ, పోలిమెట్ల ప్రశాంత్, నాగళ్ల సీతారాంబాబు, రాయంకుల సత్యనారాయణ, ఐతం మహేష్, షేక్ మేరా సాహెబ్, నల్లూరు ప్రభాకర్ రావు, మేడంకి చిన్న, చింతపల్లి సుధ గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు బహుమతులు



కొయ్యలగూడెం శాఖా గ్రంథాలయంలో క్రాఫ్ట్ వర్క్ లో నిమగ్నమైన విద్యార్థులు.

కొయ్యలగూడెం: శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తోన్న వేసవి శిబిరాలు ఆదివారం ముగియనున్నాయి. సుమారు నెల రోజులపాటు పాఠశాల స్థాయి విద్యార్థులకు వివిధ అంశాలపై రిటైర్డ్ ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రాఫ్ట్ వర్క్‌లో తమ ప్రతిభను ప్రదర్శించారు. ముగింపు సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు, వేసవి శిబిరాల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేయనున్నారు.

పేదల సంక్షేమం సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- దొరమామిడిలో గడపగడపకు మన ప్రభుత్వం

బుట్టాయగూడెం: రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలకు అంతులేని విశ్వాసం, నమ్మకం ఉన్నాయని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం మండలం దొరమామిడిలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేస్తోన్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ పేదలకు మేలు చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రజలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు వలంటీర్‌ల ద్వారా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ వర్తింపజేస్తున్నారని, నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే పథకాలు అందేవిధంగా చేస్తున్నారని తెలిపారు. ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ విజయంతో గెలిపించాలని బాలరాజు కోరారు. రాష్ట్రంలోని 175 స్థానాలకు 175 స్థానాలు వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ తెల్లం రాముడు, నాయకులు కాలింగి వెంకటేశ్వరరావు, సోయం వెంకటరామయ్య, సర్పంచ్‌లు జోడే సత్యదుర్గా ప్రసాద్, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు, తదితరులు పాల్గొన్నారు.



దొరమామిడిలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

ముగిసిన యోగ శిక్షణ



పరింపూడి బాలికల ఉన్నత పాఠశాలలో వృక్షాసనం వేసిన బాలికలు



బాలికల నటరాజ ఆసనం



చక్రాసనం వేసిన విద్యార్థినులు


కొయ్యలగూడెం: వేసవి సెలవుల నేపథ్యంలో కొయ్యలగూడెం మండలం పరింపూడి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత యోగ, ధ్యాన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. యోగ శిక్షణ నిర్వాహకురాలు, హై స్కూల్ యోగ టీచర్ జొన్నకూటి జ్యోతి ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో 60 మందికిపైగా హై స్కూల్ బాలికలకు 33 రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఈనెల 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తాము నేర్చుకున్న అంశాలను జిల్లాస్థాయి కార్యక్రమంలో ప్రదర్శించనున్నట్లు విద్యార్థినులు తెలిపారు. యోగా టీచర్ జ్యోతికి విద్యార్థినుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారి క్షేత్రంలో జేబుదొంగల హల్‌చల్

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీవారి క్షేత్రంలో శనివారం జేబుదొంగలు హల్‌చల్ చేశారు. ఇద్దరు యువతులపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక కేశఖండనశాల వద్ద, ఆలయంలో పలువురు దొంగలు భక్తుల జేబులు ఖాళీ చేశారు. పర్సులతో పాటు, సెల్‌ఫోన్‌లను తస్కరించారు. ఈ క్రమంలో స్వామివారి దర్శనార్థం ఆలయంలోకి వెళుతున్న తాడేపల్లిగూడెంకు చెందిన సింగరాతి పద్మావతి సెల్‌ఫోన్, పర్సులను భీమడోలుకు చెందిన యువతులు దొంగిలించారు. దీంతో పద్మావతి అక్కడున్న దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది సాయంతో ఆ యువతులను పట్టుకుని తనిఖీ చేయగా.. సెల్‌ఫోన్, రూ.16,900 లభించాయి. ఆ నగదులో రూ.2 వేలు మాత్రమే పద్మవతివి. బాధితురాలు పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

ఘనంగా ముత్యాలమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం





నూతన ఆలయం వద్ద అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, ముత్యాలమ్మవారు →

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని మాతన్నగూడెంలో నిర్మించిన ముత్యాలమ్మవారి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనేక గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రెవెన్యూ, గృహనిర్మాణ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో సమన్వయంతో రెవెన్యూ, గృహనిర్మాణ శాఖాధికారులు సేవలందిస్తూ జగనన్న ఇళ్ల నిర్మాణాల లక్ష్యసాధనకు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో దెందులూరు నియోజకవర్గానికి చెందిన గృహనిర్మాణ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో జగనన్న ఇళ్ల నిర్మాణం, జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, గ్రామాల్లో స్థల సేకరణ, ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ, లక్ష్యాల సాధనపై దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల వారీగా సమీక్ష చేశారు. గ్రామస్థాయిలో సమన్వయంతో పనిచేయడం వల్ల సత్ఫలితాలు లభించాయని, ఇదే స్ఫూర్తితో మరింత వేగవంతంగా జగనన్న ఇళ్ల నిర్మాణానికి లక్ష్యాల సాధనకు సేవలందించాలని కోరారు. సమీక్ష సమావేశంలో దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, పెదవేగి ఎంపీపీ తాతా రమ్య, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, అన్ని శాఖ అధికారులు పాల్గొన్నారు.



రెవెన్యూ, గృహనిర్మాణ శాఖాధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఒక యువకుడు పురుగుమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతడ్ని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. టి.నరసాపురం మండలం తిరుమలదేవిపేట పంచాయతీ వెంకటాపురానికి చెందిన దోమతోటి శ్రీను, నాగలక్ష్మి దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు రాహుల్ (19) మోటర్ మెకానిక్. గత కొంతకాలంగా అతను ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లకు బెట్టింగులు కడుతూ ఆర్థికంగా నష్టపోయాడు. అప్పులపాలు కావటంతో వాటిని తీర్చే పరిస్థితి లేక తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఈనెల 9న సాయంత్రం పురుగుల మందు తాగేశాడు. తీవ్ర అస్వస్థతకు గురికావటంతో రాహుల్‌ను ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా శనివారం ఉదయం మృతి చెందాడు. టి.నరసాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పేకాట స్థావరాలపై దాడి

పెదవేగి : రెండు వేర్వేరు పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. పెదవేగి మండలం ప్రకాష్‌నగర్‌లో ఆరుగురిని అదుపులోకి తీసుకుని, రూ.7,800 స్వాధీనం చేసుకున్నట్టు పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ శనివారం తెలిపారు. పెదవేగి మండలం దిబ్బగూడెం – లక్ష్మీపురంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై ఇతర సిబ్బందితో కలిసి దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,100 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ను కలిసిన ఉపాధ్యాయులు

పెదపాడు: ఉపాధ్యాయులు విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దేందుకు తమవంతు ప్రయత్నం చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు తెలిపారు. శనివారం మండలంలోని ఉపాధ్యాయులంతా కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావును మర్యాద పూర్వకంగా కలుకుని అభినందించారు. జెడ్పీ చైర్‌పర్సన్‌రే పుష్పగుచ్ఛాలు అందించి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంగప్రసాద్, జీ సాంబశివరావు, శరత్, తోట ప్రసాద్, ఆరవల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. వడ్డిగూడెం మాజీ సర్పంచ్ మోరు పెద సుబ్బరాజు, పలువురు గ్రామ పెద్దలు జెడ్పీ చైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. తినాతి విజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ను కలిసిన పెదపాడు మండల ఉపాధ్యాయులు

24 మంది స్కూల్ అసిస్టెంట్ల చేరిక

నిడమర్రు: ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా మండలంలో 24 మంది బదిలీలు, పదోన్నతులపై 24 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు శనివారం నిడమర్రు మండలానికి వచ్చినట్లు ఎంఈవో పుచ్చల శేషు తెలిపారు. గణపవరం, ఏలూరు తదితర మండలాల నుంచి బువ్వనపల్లి యూపీ స్కూల్‌తోపాటు, 7 జెడ్పీ స్కూళ్లకు కొత్తగా బదిలీపై స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లు వచ్చారు. వారు ఆయా పాఠశాలల్లో శనివారం విధుల్లో చేరారు. వీరందరికీ ఎంఈవో పుచ్చల శేషు దిశా నిర్దేశం చేసారు. మండలంలో ఖాళీగా ఉన్న సెకండరీ గ్రేడ్ పోస్టుల్లో దరఖాస్తు చేసుకున్న టీచర్లకు శనివారం రాత్రి జాయినింగ్ ఆర్డర్లు ఆన్‌లైన్‌లో అందుతాయన్నారు. వీరందరూ ఆదివారం కేటాయించిన స్కూళ్లలో హాజరు కావాలన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే సోమవారం నాటికి మండలంలోని అన్ని కేడర్లలో టీచర్లు ఆయా పాఠశాలల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. సోమవారంతో ఆన్‌లైన్ బదిలీల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. భాషోపాధ్యాయుల పదోన్నతులు పూర్తవ్వాల్సి ఉందన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు పదోన్నతిపై జాయినింగ్ ఆర్డర్లు తీసుకున్న వారిలో సీహెచ్ లీలాగోపాల్, సీహెచ్ భారతిలక్ష్మీకుమారి, పల్లా నరసింహమూర్తి, ఏఆర్‌కే కుమార్, బయాలజికల్ సైన్స్ పదోన్నతి తీసుకున్నవారిలో తాడి గోపాలకృష్ణ ఉన్నారు. ఈ కార్యక్రమంలో యూపీ స్కూల్ హెచ్‌ఎం సంకు ఏసు, ఉపాధ్యాయులు జె. ఏసు, దంగేటి సత్యనారాయణ తదితరులున్నారు.



జాయినింగ్, రిలీవింగ్ రిపోర్టులు అందిస్తున్న ఎంఈవో పుచ్చల శేషు

సైన్స్ అసిస్టెంట్‌కు హెచ్‌ఎంగా పదోన్నతి

దెందులూరు: చల్లచింతలపూడి ఉన్నత పాఠశాల సైన్స్ స్కూల్ అసిస్టెంట్ వడ్లపట్ల విజయ్‌కుమార్‌కు శనివారం ఉంగుటూరు మండలం రాచూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పదోన్నతి లభించింది. ఈమేరకు జిల్లా విద్యాశాఖాధికారి లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. పదోన్నతి పొందిన హెచ్‌ఎంను సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమనారాయణ, పేరెంట్స్ కమిటీ, ఎండీఎం కమిటీ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించి ఘనంగా సత్కరించారు.

విద్యాభివృద్ధికి సహాయం

దెందులూరు: విద్యాభివృద్ధే లక్ష్యంగా తిరుమల మిల్క్‌డెయిరీ సంస్థ యాజమాన్యం సహాయ సహకారాలు అందిస్తోందని మండలంలోని శింగవరం గ్రామంలోని ప్లాంట్ హెచ్‌ఆర్ మేనేజర్ మల్లికార్జున్ శనివారం తెలిపారు. గుండుగొలను ఉన్నత పాఠశాలకు రూ. 8 లక్షలతో 10 కంప్యూటర్లు, రూ. 2లక్షల విలువైన 10 కుర్చీలు, 10 టేబుళ్లు, ఫర్నిచర్‌ను అందించామన్నారు. ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సమక్షంలో వాటిని అందజేశామని తెలిపారు.

పెదవేగి గురుకులం ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసరావు

పెదవేగి : పెదవేగిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన ఎన్. భారతి జంగారెడ్డిగూడెం గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లారు. శ్రీనివాసరావు కృష్ణాజిల్లా తిరువూరులోని గురుకుల విద్యాలయం అధ్యాపకునిగా పనిచేస్తూ బదిలీపై పెదవేగి వచ్చారు. ఆయన ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. పీడీ కె.జయరాజు, ఉపాధ్యాయులు ఆచార్యులు, శివప్రసాద్, శ్రీనివాస్, సిబ్బంది, శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందించి, అభినందించారు.

వైభవంగా కంచికామాక్షి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ

గణపవరం: గణపవరం బాలయ్య చెరువు వద్ద ఉన్న కంచికామాక్షి, కనకదుర్గ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద హోమాలు, శాంతి పూజలు, గోపూజలు నిర్వహించి వేదమంత్రోచ్ఛరణల మధ్య అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అమ్మవారి ఆలయాన్ని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు దర్శించుకుని పూజలు చేశారు.

భక్తులతో కిక్కిరిసిన శ్రీవారి క్షేత్రం



శ్రీవారి ఆలయంలో కిక్కిరిన భక్తులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్యక్షేత్రం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు, వేసవి సెలవులతో సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలవడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, తూర్పురాజగోపుర ప్రాంతాలతో పాటు, కేశఖండనశాల ఇతర విభాగాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు అలరించాయి. క్యూలైన్లలో భక్తులకు దేవస్థానం సిబ్బంది మజ్జిగ, మంచినీటిని పంపిణీ చేశారు. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.